క్లుప్తంగా

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నుల బకాయిలు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అజెండాలోని అంశాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

వీరాంజనేయునికి శ్వేతార్క పుష్ప పూజ



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి శ్వేతార్క పుష్ప పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకం జరిపారు. సాయంత్రం ఆలపాటి బార్గవ సాయి దంపతులు పట్టు వస్త్రాలు, పుష్ప మాలలతో స్వామిని అలంకరింపజేశారు. స్వామికి తెల్ల జిల్లేడు పూలు, నిమ్మకాయలతో అష్టోత్తర సహస్రనామ పూజలు జరిపారు. పల్లకీ ఉత్సవం నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

1న భట్టిప్రోలులో హనుమజ్జయంతి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని దేవస్థాన కమిటీ నిర్వాహకులు మోర్ల జయప్రసాద్(బుజ్జి) తెలిపారు. అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి

బాపట్లటౌన్: అనారోగ్యంతో సర్పంచ్ మృతి చెందిన సంఘటన మండలంలోని చుండూరుపల్లిలో చోటు చేసుకుంది. చుండూరుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ జి.వంశీకృష్ణ గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం చుండూరుపల్లిలోని తన నివాసంలో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సర్పంచ్ వంశీకృష్ణ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోన రఘుపతి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు నాగేంద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు

పొన్నూరు: మండలంలోని కట్టెంపూడి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నాగేంద్రస్వామి దేవస్థానం(పుట్ట)కు సంబంధించిన రెండు హుండీలను ఈ నెల 30న లెక్కించనున్నట్లు ఆలయ మేనేజరు ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండోమెంట్ బాపట్ల ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ వి.శివనాగేంద్రమ్మ, సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

'ఆటా' సమావేశాలకు సాయి లక్కరాజు



తెనాలి: అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 18వ ద్వైవార్షిక సమావేశాలకు తెనాలికి చెందిన స్వరలయ వేదిక సంస్థ వ్యవస్థాపకుడు, కవి, రచయిత, నటుడు, దర్శకుడు సాయి లక్కరాజుకు ఆహ్వానం లభించింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో జూన్ 7,8,9 తేదీల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. 8వ తేదీన జరిగే ప్రారంభసభలో ప్రముఖ రచయితలు, కవులు నందినీ సిద్ధారెడ్డి, కాసర్ల శ్యామ్, అఫ్సర్ పాల్గొంటారు. రెండో సెషన్‌లో సినిమా రంగానికి చెందిన వంగా సందీప్‌రెడ్డి, ఆదిత్య, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్ హాజరవుతారు. 'విభిన్న స్వరాల వేదిక' పేరుతో జరిగే మూడో సెషన్‌లో సాయి లక్కరాజు కీలకోపన్యాసం ఉంటుందని తెలియజేశారు. గతంలో మలేషియా, సింగపూర్, దుబాయ్, కెనడా, స్పెయిన్ దేశాల్లో తెలుగు వారు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న సాయికి తాజాగా ఆటా ఆహ్వానం లభించిన సందర్భంగా బుధవారం సంస్థ కార్యాలయంలో సభ్యులు అభినందించారు. స్వరలయ వేదిక ముఖ్య నిర్వాహకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ప్రభుత్వ అధికారి డి.రమణయ్య, పి.సురేష్, నటులు మల్లేశ్వరరావు, హేమాచారి పాల్గొన్నారు.

దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు

- దోమ కాటుతో గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధులు
- ఇటీవల కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు చేరటంతో విజృంభిస్తున్న దోమలు
- పలు రోగాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న రోగులు
- తగు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



భట్టిప్రోలు బీసీ కాలనీలో ఇళ్ల మధ్య చేరిన వర్షపు నీరు

భట్టిప్రోలు: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కాలంలో వర్షాలు కురిశాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లపు ఖాళీ స్థలాల్లో చేరిన వర్షపు నీరు ఎటూపోని పరిస్థితి నెలకొంది. అది మురుగు నీరుగా మారి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల దాడితో పాటు మారిన వాతావరణ పరిస్థితులు, అపరిశుభ్ర పరిసరాల కారణంగా కలుషిత తాగునీరు తాగడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమే కదా అని ఊరుకుంటే ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యాధికారులు అంటున్నారు. ఇలాంటి తరుణంలో దోమల వల్ల కలిగే అనర్థాలు, వచ్చే జబ్బులు, వాటి లక్షణాలను గూర్చి తెలుసుకోవాలని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ రామలక్ష్మి సూచిస్తున్నారు.

మలేరియా వ్యాధి లక్షణాలు

అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. సాధారణంగా ఈ దోమ నిల్వ ఉన్న నీటిలో కానీ, మంచినీటిలో కానీ వద్ధి చెందుతుంది. ఈ జ్వరం సాధారణంగా 10 నుంచి 14 రోజులు పాటు ఉంటుంది. చలితో రోగి వణుకుతూ ఉంటాడు. రోజు విడిచి రోజు జ్వరం రావడం జరుగుతూ ఉంటుంది. వాంతులు కూడా అవుతూ ఉంటాయి.

డెంగీ లక్షణాలు

సాధారణంగా ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ గుడ్లు పెడుతుంది. ఈ వ్యాధి సోకితే 15 రోజుల పాటు జ్వరం ఉధృతంగా ఉంటుంది. తల నొప్పి, నొసటిపై, కంటి లోపల నొప్పితో రోగి చాలా బాధ పడుతుంటాడు. కడుపు నొప్పి కూడా వస్తూ ఉంటుంది.



11వ వార్డు డ్రైనేజీలో చేరిన లార్వా

చికున్ గున్యా లక్షణాలు

ఈడిస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. ఈ వ్యాధి బారిన పడిన రోగికి 10 నుంచి 14 రోజుల పాటు తీవ్ర నొప్పులతో కూడిన జ్వరం ఉంటుంది. జ్వరం తగ్గినా మరో 10 రోజుల పాటు తీవ్రంగా ఒళ్ళు నొప్పులు ఉంటాయి.

మెదడువాపు వ్యాధి లక్షణాలు

మెదడువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. క్యూలెక్స్ దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువగా మురుగునీటి నిల్వల్లో పెరుగుతుంది. 14 రోజుల పాటు తీవ్రమైన జ్వరంతో బాధ పడుతుంటారు. మత్తుగా సోలిపోతుంటారు. జ్వరం తీవ్రమైతే బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా ఈ జ్వరం రెండు నుంచి 14 సంవత్సరాల పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది.

దోమల నియంత్రణకు చర్యలు

- మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి
- మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చేయాలి
- పరిసర ప్రాంతాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించుకోవాలి.
- ఇళ్ల మధ్య గుంతల్లో నిలిచిన నీరు ఎక్కువ కాలం నిలవకుండా చూసుకోవాలి.
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమల నియంత్రణ మందు వేయాలి.
- దోమలు కుట్టకుండా దోమతెరలు ఇతరత్రా విధానాలు అవలంబించాలి.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



దోమలు ఎడా పెడా కుడుతున్నాయి. దీంతో దద్దుర్లు వస్తున్నాయి. దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. కనీసం నెలకు ఒక్కసారైనా మురుగు కాల్వలో ఫినాయిలు, చెత్త కుప్పలపై బ్లీచింగ్, సున్నం కూడా చల్లడం లేదు. అసలే భట్టిప్రోలు బోదకాలు, హెర్నియాకు పెట్టింది పేరు. పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి.

–పప్పుల విజయరాజు, భట్టిప్రోలు.

దోమల నుంచి రక్షణ పొందాలి



ఇటీవల కాలంలో వైరల్ ఫీవర్లు నమోదు అవుతున్నాయి. దోమల దాడి నుంచి రక్షణ పొందాలి. వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గుతుంది. అలా కాకుండా జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

–సీహెచ్ రామలక్ష్మి, వైద్యురాలు, వెల్లటూరు పీహెచ్‌సీ.

ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వర్తించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్

రేపల్లె రూరల్: ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది తమ విధులను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ సూచించారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులకు పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 4వ తేదీ రేపల్లె అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం బాపట్లలో జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. రేపల్లె నియోజకవర్గంకు సంబంధించి 12 కౌంటింగ్ హాల్స్‌లో లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. ఒకవైపు పోస్టల్ బ్యాలెట్‌లు, మరోవైపు ఈవీఎం ఓట్ల లెక్కింపులు జరుగుతాయన్నారు. లెక్కింపు కేంద్రాలలోకి గుర్తింపు పొందిన కార్డులు, పాసులు లేనిదే అనుమతులు ఉండవన్నారు. లెక్కింపుకు హాజరయ్యే అధికారులు తమకు మంజూరు చేసిన పాసులతో పాటు ఏదైనా గుర్తింపు కార్డుతో రావాలన్నారు. ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఓట్ల లెక్కింపు విధానంపై ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ అవగాహన కల్పించారు. సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి చొప్పా రవీంద్ర, తదితరులున్నారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ



హాజరైన సిబ్బంది

మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలో వంట చేస్తున్న వారికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైయినర్స్ పడవల కిషోర్, ఉలవలపూడి సురేష్‌లు వ్యవహరించారు. మండల స్థాయి పర్యవేక్షకులుగా ఎంఈవో-2 నీలం దేవరాజు వ్యవహరించారు. ఉన్నత పర్యవేక్షకులుగా డెప్యూటీ డీఈవో జి. వెంకటేశ్వరరావు, ఏఎంవో పి. శ్రీనివాసరావులు వంట నిర్వాహకుల సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో భాగంగా తాజ్ హోటల్ వారు వంటలపై చేసిన పీపీటీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో 40 మంది వంట నిర్వాహకులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైయినర్ కిషోర్, ఎంఈవో దేవరాజు

అభయాంజనేయుడికి సామూహిక అభిషేకాలు

గాజులపేట(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి వారి ప్రథమ ప్రతిష్ఠా మహోత్సవం పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మోర్లోట శివాలయం సమీపంలోని కృష్ణానది పావన జలాలతో అభిషేకాలు జరిపారు. స్వామి వారికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామి వారి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అభయాంజనేయ స్వామి



స్వామి వారికి జలాభిషేకం

అల్లాబక్షీ సేవలు మరువలేనవి

విశ్రాంత ఆహార విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి

బాపట్ల: ప్రముఖ జర్నలిస్టు, రచయిత అల్లాబక్షీ మరణం పత్రికా, సాహిత్య రంగాలకు తీరని లోటని విశ్రాంత ఆహార విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి అన్నారు. బుధవారం రాత్రి బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన అల్లాబక్షి సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్టు బాషా అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా అల్లా బక్షి విశేషంగా రాణించారని సాహిత్యానికి బక్షి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆనంద్ బక్షి అనే కలం పేరుతో అల్లా బక్షి అనేక రచనలు చేశారని తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అల్లాబక్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు సభలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణ భట్టు, ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షులు పీసీ సాయి బాబు, హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషి బాబు, గిరిజారాణి, ప్రముఖ న్యాయవాది జమ్రుద్ బాషా, బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యాంసుందర్, ప్రముఖ రచయిత ఆర్.ఎస్.వర్మ, ఆదం షఫీ, షేక్ జిలాని, రహీమ్ జానీ, కమల్ భాష, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మహమ్మద్ ఖాన్, సయ్యద్ పీర్, బండి కళ్ళ బాబురావు, దేవరకొండ రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి

ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

పెదకాకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు పరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు, గోళ్ళమూడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సీపీఎం బృందం సందర్శించింది. ఈ కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండు చేశారు. కనీస రోజువారీ వేతనం రూ.300లు ఇవ్వాలని, మేట్లకు అదనంగా రూ.200లు ఇవ్వాలన్నారు. కూలీలు రెండు పూటలా పని చేయాలనే నిబంధనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బురదగుంట సాంబయ్య, రాజా రమేష్, మన్నెం శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పాశం రామారావు

సాంకేతిక విద్యతో ఉద్యోగావకాశాలు

వెంకటేశ్వర స్పిన్ టెక్స్ సంస్థ జీఎం ఏ గిరిధర్

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలను పొందిన విద్యార్థులకు విజయోత్సవ సభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల టెక్స్‌టైల్స్ విభాగాధిపతి కె మహమ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కావూరులోని శ్రీ వెంకటేశ్వర స్పిన్ టెక్స్ సంస్థ జనరల్ మేనేజర్ ఏ గిరిధర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య ద్వారా విద్య పూర్తయిన అనంతరం త్వరిత గతిన ఉపాధిని పొందవచ్చన్నారు. టెక్నికల్ డిప్లమోలతో ఉన్నత స్థానాలలో ప్రస్తుతం ఉన్న పూర్వ విద్యార్థుల విజయ గాథలను వివరించారు. గుంటూరు టెక్స్‌టైల్స్ డైరెక్టర్ నక్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ పరిశ్రమలలోనే కాకుండా మార్కెటింగ్, కన్సల్టెన్సీ విభాగాలలో కూడా టెక్స్‌టైల్స్ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కాలే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నూరు శాతం ఉపాధిని కల్పించామన్నారు. అందులో 13 మంది విద్యార్థులకు మంచి జీతంతో ఉన్నత సంస్థల్లో ఉపాధి లభించిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగాలను పొందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ ఉప్పలపాటి రాధాకృష్ణ, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ కే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రుచిగా గోరుముద్ద అందించాలి

పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే గోరుముద్ద కార్యక్రమాన్ని రుచిగా, శుచిగా, పోషక విలువలు కోల్పోకుండా చక్కగా నిర్వహించాలని తెనాలి ఉప విద్యాశాఖాధికారిణి జి. శాంత కుమారి సూచించారు. పొన్నూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్నం భోజన నిర్వహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలో వందశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేలా చూడాలని కోరారు. ఎంఈవోలు ఆర్.శోభాచంద్, కె.శ్రీనివాసరెడ్డి వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. టి.భాను కిషోర్ కుమార్, ఆర్.శాంతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వహణ, అందులోని పోషక విలువలు గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలల వంటవారు, హెల్పర్స్, సీఆర్పీలు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం వివిధ వంటలతో ప్రదర్శన నిర్వహించారు.



ఆహారాన్ని రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు

దాతల సహకారం అభినందనీయం

పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ ఉప కమిషనర్ వీవీఎస్‌కే ప్రసాద్ అన్నారు. పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బోయపాటి వెంకట రమణ బుధవారం శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి రూ.27 వేలు విరాళం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన భక్తులకు, దాతలకు విజ్ఞప్తి చేశారు.

విద్య ఆవశ్యకతపై ప్రచారం

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీఆర్‌బీసీ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక యడ్ల లింగయ్య కాలనీ, నందులపేట, రూరల్ మండలం కొలకలూరు, కఠెవరం ప్రాంతాల్లో విద్యా చైతన్య ప్రజారోద్యమాన్ని నిర్వహించారు. డీఆర్‌బీసీ కమ్యూనిటీ మొబిలైజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బడి వయసు కలిగిన చిన్నారులు అందరినీ తప్పనిసరిగా బడికి పంపి చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



పెదకాకాని: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో గొడవలు, అల్లర్లకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని సీఐ కె వీరా స్వామి అన్నారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి, అగతవరప్పాడు గ్రామాల్లో బుధవారం కవాతు నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రోడ్ల వెంబడి పోలీసు కవాతు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమయంలోనూ, ఫలితాలు వెలువడిన తరువాత ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే గ్రామంలో వివాదాలకు పాల్పడే పలువురు వ్యక్తులను గుర్తించడం జరిగిందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు శాంతియుతంగా ఉంటూ సహకరించాలన్నారు. ఈ కవాతులో ఎస్ఐలు నాగేంద్ర, ఎండీ మిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధ స్తూపం నిర్వహణపై శీతకన్ను

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని బౌద్ధ స్తూపం ఆవరణలో విద్యుత్తు లైట్లు లేక అంధకారం అలుముకుంది. అమరావతి తరువాత అత్యంత చరిత్ర ప్రసిద్ధి గాంచిన బౌద్ధ స్తూపం వద్ద మౌలిక వసతుల కల్పనలో పర్యాటక శాఖ శీతకన్ను వేయడం శోచనీయం. గతంలో స్తూపం ఆవరణలో సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. అది కాస్తా రిపేరుకు గురి కావడంతో నాటి నుంచి నేటి వరకు లైట్లు లేక చీకటి మయంగా ఉంటుంది. బౌద్ధ స్తూపానికి ప్రత్యేకంగా విద్యుత్ మీటరు ఉన్నప్పటికీ లైట్లు ఏర్పాటు చేసినా చెట్లు మూసుకు పోవడంతో కనబడటం లేదు. ఈ బౌద్ధ స్తూపాన్ని వీక్షించేందుకు బౌద్ధులు, టూరిస్టులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. లోపల లైట్లు సరిగా లేకపోవడంతో ఇక్కడ బౌద్ధ స్తూపం ఉందని తెలియడం లేదు. స్తూపం ముఖ ద్వారం వద్ద పంచాయతీ వీధి లైటు ఒకసారి వెలిగితే మరోసారి వెలగదు. పట్టించుకునే నాథుడు ఉండడు. పురావస్తు, పర్యాటక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్తూపం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని భట్టిప్రోలు వాసులు కోరుతున్నారు.



మరమ్మతుకు గురైన సోలార్ లైటు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరిపై వేటు

పొన్నూరు: ఎన్నికల నియమావళి ఉల్లంఘించి టీడీపీ ప్రచారంలో పాల్గొన్న జడవల్లి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల స్వీపర్ మిక్కిలి నాగవల్లి, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు పిల్లి వీరమ్మలను విధుల నుంచి తొలగించినట్లు ఏఆర్‌వో, తహసీల్దార్ నారాయణ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్నారని కర్లపూడి భూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.